10

# దక్షిణ రాజ్యము

## రెహబాము సింహాసనమెక్కినది మొదలు యెరూషలేము పతనంవరకు, క్రీ.పూ. 975-586 (1 రాజులు 12-22; 2 రాజులు 1-25; 2 దినవృ. 10-36[1])

**పరిచయము.** – షోమ్రోను (సమరయ) పతనంతో ఇశ్రాయేలు రాజ్యం అంత మయ్యింది, దానితో ద్వంద్వ రాజ్య కాలం ముగిసింది. దాదాపు యూదా నూటాయాభై సంవత్సరాలు అధికంగా కొనసాగింది. సమరయ పట్టుబడడం అనేది ఇశ్రాయేలుకంటె యూదాకు తక్కువ ప్రాముఖ్యమైన సంఘటనగా ఉంది. నాలుగువందల యూదా చరిత్ర కాలాన్ని ఏక కాలంగా గుర్తించి మనం ఐక్యతను భద్రపరచవచ్చు.

శాశ్వతంగా ఉన్న ఒక గొప్ప పేరుగల ప్రభావాన్ని యూదావారి చరిత్ర ఉదాహరిస్తుంది. దావీదు పరిపాలన ఆదర్శమైన ఒక రాజును, రాజ్యాన్ని యిస్తుంది. ప్రవచనపు నిరీక్షణలు, దేశ ప్రజల సహజ ప్రేరణ తన చుట్టును, తన ఆలోచన చుట్టును సేకరించబడ్డాయి. సొలొమోను విగ్రహారాధనవల్ల నైతిక షాక్ తరువాత, అవి రెహబాము చుట్టును, ఉత్తర రాజ్యము చుట్టును పోగుచేయబడ్డాయి. తిరుగుబాటును అణచడానికి రెహబాము అనుమతించబడలేదు. యరొబాము, యెహూ అనే వారిద్దరు రాజ వంశ స్థాపకులుగా ప్రవచనం ప్రకారమే సూచింపబడ్డారు; అయితే వారిద్దరు కూడా ఆ ప్రవచనపు నిరీక్షణను పూర్తిగా నిరాశపరచారు. చివరిగా, షోమ్రోనును, ఇశ్రాయేలును అష్షూరుకు స్వాధీనమైన తరువాత, అల్ప రాజ్యమైన యూదా, "పూర్ణమైన జాతీయ తత్వాన్ని తన లోనికి తాను" అతి శ్రేష్ఠమైన భావాన్ని బట్టి "సమకూర్చుకొంది."

బైబిలు చరిత్ర యొక్క ప్రధానమైన ఉద్దేశాన్ని మనం మరచిపోకూడదు; అంటే, సత్యమైన మతము యొక్క ఆరంభము, అభివృద్ధి. ఆ ఉద్దేశపు వెలుగులోనే హెబ్రీయుల చరిత్రను చదవాలి. అలా చూచినప్పుడు, దక్షిణ రాజ్యాన్ని నాలుగు వందల సంవత్సరాలు క్షీణత, ఉజ్జీవము అనే నాలుగు కాలాలుగా విభజింపవచ్చు. ప్రతిది కూడా ఆ కాలంలో ఏలుబడిచేసే రాజుల శీలముతో దగ్గర సంబంధం కలిగి ఉంటుంది. ఇశ్రాయేలువలె కాక, దావీదుకు చెందిన ఒకే రాజ వంశము యూదాలో ఉన్నట్టు జ్ఞాపకం చేసికోవాలి.

### I. తొలి క్షీణత, ఉజ్జీవములు.

#### నాలుగు పరిపాలనలు, తొంభై సంవత్సరాలు.

**1. రెహబాము, అబీయాముల క్రింద క్షీణత.** – ఎ. మతము. – సొలొమోను క్రింద తిరిగిన

విగ్రహ సంబంధమైన మలుపులు కొనసాగి, ఇరవై సంవత్సరాలుగా వృద్ధినొందాయి. ప్రవక్తల ప్రతిఘటన ఉండి కూడా దేవుని ఆరాధన తగ్గిపోయింది, దేశమంతటిలో విగ్రహ సంబంధమైన గుడులు వెలిశాయి, భయంకరమైన అవినీతి ప్రజల మధ్య వ్యాపించింది.

**బి. ఇశ్రాయేలుతో సంబంధం.** – యరొబాము క్రింద పది గోత్రములు ఏకమై అతని రాజుగా చేయగా, ఆ తిరుగుబాటును అణచడానికి రెహబాము సైన్యాన్ని రేపినా, షెమయా ప్రవక్త సలహాను అనుసరించి అతడు ఆ ప్రయత్నాన్ని మానుకున్నాడు. ఏదియేలాగున్నా, రెండు రాజ్యాలు విరోధంగానే కొనసాగాయి. మరియు అబీయాము మూడేండ్ల పరిపాలనా కాలంలో, సెమరాయిము కొండవద్ద ఇశ్రాయేలు వారితో యుద్ధము చేసి, బాగా ఓడించాడు.

**సి. షీషకు యొక్క దండయాత్ర.** – సొలొమోను ఐగుప్తీయుల రాజ కుమార్తెను వివాహమాడాడు; కాని నైలునొద్ద లేచిన ఒక రాజ వంశము యరొబాముకు సహాయం చేసింది. ఆ రాజ వంశీయుడైన షీషక్, పాలస్తీనాపై దాడిచేసి, యెరూషలేమును పట్టుకొని, దేవాలయానికిగల బంగారు వైభవాన్ని లాగివేశాడు. కర్నాక్[2] యొద్ద ఉన్న గొప్ప గుడి గోడపై షీషక్ దీన్ని చెక్కించి బైబిలు వర్తమానాన్ని స్థిరపరచాడు.

**2. ఆసా, యెహోషాపాతు క్రింద ఉజ్జీవము.** – ఎ. సంస్కరణలు – పవిత్రతలోను, శక్తిలోను ఆసా నలభై ఒక్క సంవత్సరములు పరిపాలన ముందున్న రెండింటికంటెను వ్యత్యాసాన్ని చూపుతుంది. పలు సంవత్సరాల కాలము అతడు గొప్ప శాంతిని అనుభవించాడు. ఆ కాలంలో విగ్రహారాధనకు సంబంధించిన బలిపీఠాలను తొలగించడంచేత యెహోవా దేవుని ఆరాధనకు గుర్తింపును తెచ్చి దాన్ని పెంపొందింపజేశాడు. యెహోషాపాతు ఇరవైయయిదు సంవత్సరాలు నీతిగా పాలించాడు. తన తండ్రి చేసిన సంస్కరణలను అతడు యింకను ముందుకు తీసికొని పోయాడు, మతసంబంధమైన బోధ క్రమంగా జరిగేలా ఏర్పాట్లు చేశాడు, మరియు న్యాయం జరిగే పద్ధతిని పెంపొందించాడు.

**బి. కూషీయుడైన జెరహు దండయాత్ర.** – జెరహు క్రింద పది లక్షలమంది కూషీయులు దండెత్తివచ్చి, ఆసా శాంతిని చెరిచారు. దేవునికి మనఃపూర్వకంగా ప్రార్థించి యుద్ధమునకు వెళ్లి ఎంతటి కడపటి తీర్పైన యుద్ధాన్ని చేసాడంటే, అటు ప్రక్కనుండి యింకా మూడు వందల సంవత్సరాలు ఏ దండయాత్రను యూదా ఎదుర్కొనలేదు. గొప్ప సమూహంతో ఆసా ఆ విజయాన్ని కొనియాడాడు, అక్కడ జాతీయ నిబంధన సరి క్రొత్తదిగా చేయబడింది, సంస్కరణల కార్యక్రమం మరి ఎక్కువగా ప్రోత్సహించబడింది.

**సి. వివాహ సంబంధము.** – ఆసా తన జీవితపు తరువాత భాగంలో ఇశ్రాయేలుకు విరోధంగా సిరియాతో బాంధవ్యాన్ని పెంచుకున్నాడు. యెహోషాపాతు తన తండ్రి పట్టుకున్న సంబంధాన్ని తలక్రిందుగా మార్చివేశాడు, ఇశ్రాయేలు రాజగు అహాబు కుమార్తెను తన కుమారునికి పుచ్చుకొని, సిరియాకు వ్యతిరేకముగా అహాబుకు సహాయం చేశాడు.

## II. రెండవ క్షీణత, ఉజ్జీవములు.

### తొమ్మిది పరిపాలనలు, రెండువందల సంవత్సరాలు.

**1. క్షీణత.** – ఎ. యెహోరాము, అతల్యా. – యెహోషాపాతు కుమారుడైన యెహోరాము సింహాసనానికి వస్తాడు. అతడు అహాబు కుమార్తెయైన అతల్యాను పెండ్లిచేసికొంటాడు. తన తల్లియైన

యెజెబెలు తీవ్రమైన ఆత్మను, బయలు దేవతారాధనను యూదాకు కొని వచ్చింది. ఆసా, యెహోషాపాతుల పని చక్కనైన మార్గంలో నాశనం చేయబడేలా ఉంది. ఎనిమిది సంవత్సరాల తరువాత అహాబు యింటిపైకి ఇశ్రాయేలులోనుండియే వచ్చిన యెహూ వెళ్లి వారిని కనికరము లేకుండ నాశనము చేయగా, యెహోరాము తరువాత వచ్చిన అతని కుమారుడైన అహజ్యా హతమార్చబడ్డాడు. అతల్యా తప్పించుకొని, ప్రభుత్వపు పగ్గాలను చేజిక్కించుకొంది, రాజ కుమారుల నందరిని సంహరించింది, యోవాషు మాత్రమే తప్పించబడినా, తరువాత ఆరు సంవత్సరాలు యూదా యెజెబెలు కంటె అధికంగా ఉంది. దావీదు సంతతివారు ఒకే శిశువుగా మిగిలేలా తరగిపోయారు, విగ్రహారాధికురాలైన రాణి సింహాసనాన్ని అధిష్టించింది; దావీదు వంశం అంతరించడానికి అంతా చివరకు చేరుకుంది; వివాహ విషయములో యెహోషాపాతు పొరబడిన సిద్ధాంతం అంతటి చేదైన ఫలితాలను తెచ్చింది.

**బి. యోవాషు, మరియు ప్రతిఘాతము.** - వృద్ధుడగు ప్రధాన యాజకుడైన యెహోయాదాచే అతల్యా కడకు సంహరింపబడగా, బాలుడైన యోవాషును అతడు సింహాసనముపై కూర్చుండ బెట్టాడు. కొద్ది సంవత్సరాలు రాజ్యము పవిత్రమైన దినాలకు తిరిగి తీసికొని వెళ్లబడినట్టుగా గోచరించింది; కాని యెహోయాదా మరణానంతరం, తిరిగి పతనపు లక్షణాలు అవతరించాయి, యోవాషు క్రింద ప్రవక్తయైన జెకర్యా హత సాక్షియయ్యాడు.

**సి. ఉజ్జియా.** - దీనివెంట వచ్చిన మూడు పరిపాలనలలో, అంటే, అమజ్యా, ఉజ్జియా, యోతాముల పాలనలో, ఉజ్జియాది గమనార్హమయ్యింది. అది శక్తి వంతమైనదిగాను, భాగ్యవంతమైన ఏభై రెండేండ్ల పాలనయైయుంది. అతని విజయములే అతన్ని నాశనం చేశాయి. రాజుకు సంబంధించని, యాజకునికే చెందిన ధూపం వేయబూనినందున, తాను మరెన్నడు బాగుపడని కుష్ఠుతో బాధింపబడ్డాడు.

**డి. ఆహాజు మరియు భ్రష్టత్వము.** - ఆహాజు ఏలుబడిలో పరిపక్వం చెంది బహిరంగమైనదియు సాధారమైనదియునైన భ్రష్టత్వంవరకు అది దిగజారింది. ప్రతిచోటనున్న బయలు బొమ్మలతోను బలిపీఠములతోను సంతృప్తిపడక, "అతడు తన పిల్లలను అగ్నిని దాటించాడు (2 రాజులు 16:3). అంటే, మొలెకు ప్రతిమకు వారిని బలి యిచ్చాడు. రాజకీయ క్షీణతతో పాటు, నైతిక చెడుగు దానిని వెంబడించింది. ఎదోమీయులు, ఫిలిష్తీయులు, సిరియనులు, ఇశ్రాయేలుచేత కూడా వారు ఏడ్పించబడ్డారు. అంటే, లయము కాబోయే ఇశ్రాయేలు సహితం వారిని బాధించింది. ఆహాజు అష్షూరీయులకు ఎక్కువ కప్పం కట్టి, వారితో తన్ను కాపాడుకునే సంబంధాన్ని కుదుర్చుకున్నాడు. అప్పటిలో అష్షూరు అధికారికంగా ఔన్నత్య స్థితిలో ఉంది.

**2. హిజ్కియా క్రింద ఉజ్జీవం.** - ఎ. యెషయా, మరియు సంస్కరణ. - ఎవరి రచనలు మన వద్దకు వచ్చాయో యూదా తొలి ప్రవక్తలు: యోవేలు, ఆమోసు, మీకా, నహూము, యెషయా అనేవారు. ఎవని రచన అయిదవ సువార్త రచన అని పిలువబడిందో, ఆ యెషయా నాలుగు ప్రభుత్వ కాల భాగాలలో ప్రవచించాడు, సలహాలిచ్చాడు, ప్రకటించాడు కూడ. హిజ్కియా ఏలుబడి కాలంలో అతడు అతి ప్రాముఖ్యమైన పాత్రగా ఉన్నాడు. వాస్తవానికి అటు రాజును యిటు యాజకుని తన నీడతో కప్పిన యూదా ప్రవక్తలలో అతడు మొదటివాడైయున్నాడు. ఇశ్రాయేలులో తమ కథా నాయక శీలాలతో ఏలీయా, ఎలీషాలు రాజులను మరగుజ్జివారైనట్టు కనుపరచారు. యూదాలో ఆలాటి స్థానాన్ని తీసికొన్న వారిలో యెషయా మొదటివాడు. అతడు రాజకార్య దురంధరుడుగాను

ప్రవక్తగాను రాజ దర్బారులో ప్రత్యక్షమయ్యేవాడు. ఆహాజు ఏలుబడి కాలంలో మందుచున్న అతని మాటలు లక్ష్యపెట్టబడకున్నట్టు కన్పించినా, చివరికి అవి ఫలితాన్ని యిచ్చాయి. ఉత్తర రాజ్యము అష్షూరుతో చివరి సంఘర్షణలో ఉన్నప్పుడు, హిజ్కియా, యెషయా సలహాచే ప్రేరేపింపబడినవాడై, మత సంస్కరణలను ప్రోత్సహించడం ద్వారా యూదాకు క్రొత్త జీవిత కాలాన్ని యిచ్చాడు. దావీదు దినములు మొదలుకొని మరి ఏ రాజును అంత పవిత్రమైన ఉద్దేశాలతో సింహాసనం మీద కూర్చుండి, వాటి కొరకు ఎడతెగని కృషి చేయలేదు. తప్పుడు బయలు దేవతారాధన, భయంకరమైన మొలెకు ఉత్సవాలు అంతరించి, దేవుడైన యెహోవా ఆరాధనకు చోటునిచ్చాయి. మోషేచే చేయింపబడిన ఇత్తడి సర్పాన్ని అతడు నాశనం చేశాడు, ఎందుకంటే, అది ఒక ఆరాధనా వస్తువుగా మారిపోయింది. మరియు యెరూషలేములో పస్కా పండుగను పునరుద్ధరించి, ఇశ్రాయేలు శేషమును అందులో కలిసికొనేలా అతడు ఆహ్వానించాడు.

**బి. సెన్హెరీబు యొక్క దండయాత్ర.** – పేరుగాంచిన సెన్హెరీబు అష్షూరు దండయాత్ర అతని కాలానికి సంబంధించినదే. ఆహాజు అష్షూరుకు కప్పము చెల్లించేవాడయ్యాడు; అయితే హిజ్కియా యెషయా సలహాకు విరోధంగా, ఐగుప్తుతో సంబంధం పెట్టుకొని, అష్షూరుకు కప్పము చెల్లించ నిరాకరించాడు. గనుక సెన్హెరీబు యూదాపై దండెత్తి, అనేక పట్టణాలను పట్టుకొని రెండు లక్షల మందిని చెరగొని పోయాడు, మరియు యెరూషలేమును అతడు ముట్టడివేశాడు. ఐగుప్తు దండయాత్ర తన దేశంపైకి వస్తుందనే భయముతో అతడు తిరిగి వెళ్లాడు. మరియు వింతైన విపత్తువలన ఒక్క రాత్రియందే ఒకలక్ష ఎనభైయయిదు వేలమంది సైన్యాన్ని కోల్పోయాడు. ఈ సంఘటనను బైరన్ తన పద్యంలో యిలా ప్రారంభించి కొనియాడాడు: “గొర్రెల దొడ్డిమీద పడిన తోడేలువలె అష్షూరీయుడు దిగి పోయాడు.” నీనెవెలో సెన్హెరీబు యొక్క శిలా శాసనాలు అతని విజయాలను మాత్రమే సూచించాయి, కాని ఈ విపత్తును సూచించలేదు, హెరొడోటస్సయితే దీనిని సూచించాడు.

## III. మూడవ క్షీణత, ఉజ్జీవములు.

### మూడు పరిపాలనలు, తొంభై సంవత్సరాలు.

**1. మనష్షే, ఆమోనుల క్రింద క్షీణత.** – హిజ్కియా, యెషయాల సంస్కరణలు తాత్కాలికమైనవిగా రుజువు చేయబడ్డాయి. విగ్రహారాధనకు సంబంధించిన పార్టీ నిస్సందేహంగా ఉంటునే ఉంది. హిజ్కియా మరణానంతరం తిరిగి వారిదే పైచేయి అయ్యింది. మరియు అతని కుమారుడైన మనష్షే క్రింద, అతని ఏభై యొక్క సంవత్సరాల ఏలుబడి కాలంలో, యింతకు ముందు ఎన్నడూ జరుగనంత వేగంగా ఆ దారి క్రింద ముఖం పెట్టింది. ఎరిగిన విగ్రహ పూజలన్ని అవలంభింపబడినట్టున్నాయి: బయలు ఆరాధన, మొలెకు ఆరాధన కల్దీయుల నక్షత్రపు ఆరాధన, సోదె, యెరూషలేమును రక్తముతో నింపిన ఘోరమైన చిత్రహింసలు – మొదలైనవి అతని దీర్ఘపరిపాలనా విశేషాలు. యూదుల పారంపర్యం నమ్మదగినదైనట్లయితే, యెషయా ఈ కాలంలో హతసాక్షియయ్యాడు. మనష్షే తాత్కాలికంగా బబులోనుకు బందీయైయుండడం అతనికి బుద్ధి తెప్పించింది, విగ్రహారాధన కొంతవరకు అదుపులో ఉంచబడింది, అయితే అతని కుమారుడైన ఆమోను తన

తండ్రియొక్క దుర్మార్గతననుసరించాడు, మరియు ఒక తిరుగుబాటులో అతడు నశించాడు.

**2. యోషీయా క్రింద ఉజ్జీవము.** – ఎ. యిర్మీయా, మరియు సంస్కరణలు. – ఆమోను మరణం ఎనిమిది సంవత్సరాల బాలుడైన యోషీయాను సింహాసనానికి తెచ్చింది. ఆ చిన్న రాజ్యానికి అతని ముప్పై ఒక్క సంవత్సరాల ఏలుబడి సూర్యకాంతి యొక్క కడపటి ప్రకాశమైయుంది. రాజరికపు సంస్కర్తగా అతడు హిజ్కియాతో సమానుడై యుంటాడు; హిజ్కియాకు యెషయా ఎలాగో, కొన్ని విధాలుగా అతనికి యిర్మీయా అలాటివాడైయుంటాడు. అయినప్పటికి ప్రారంభ సంస్కరణలు ప్రవక్తినియగు హుల్దా చేత ప్రేరేపింపబడినట్టుగా కన్పిస్తాయి. యిర్మీయాకు అధికమైన పని యోషీయాకుగల మరణాన్ని వెంబడించిన చీకటిపడే సంవత్సరాలకు సంబంధించినవిగా ఉన్నాయి. పదహారేండ్ల ప్రాయంలో, యోషీయా విషయాలను తన స్వంత చేతులలోనికి తీసికొని ఉన్నట్టున్నాడు. దేవుని వైపుకు అతడు వ్యక్తిగతంగా తిరిగి, ఇరవై ఏండ్లప్పుడు, అతడు యెరూషలేమును విగ్రహ సంబంధమైన అపవిత్రతనుండి శుద్ధిచేయ నారంభించాడు; ఇరవైయారేండ్ల వయస్సులో, దేవాలయమును బాగుచేయ నారంభించాడు. రిపేరు జరుగుతున్న సమయంలో, ధర్మశాస్త్రపు ప్రతి లభించింది; మనష్షే దీర్ఘమైన చీకటి ఏలుబడి కాలంలో అది పోయి ఉండవచ్చు. దాని పవిత్రమైన ఉపదేశములచేతను, తీవ్రమైన హెచ్చరికలచేతను మరి ఎక్కువగా ప్రేరేపింపబడినవాడై, సమూయేలు దినములు మొదలుకొని ఎన్నడూ జరుగనంత ఘనంగా అతడు పస్కాపండుగ నాచరించాడు. అష్షూరు నెమ్మదిగా దిగజారుతుంది, యోషీయా యిప్పుడు తన అధికారాన్ని గతంలో ఉన్న పది గోత్రాల భూ భాగం వైపుకు వ్యాపింపజేశాడు. కనీసం అతడు బేతేలులోను, షోమ్రోనులోని యితర పట్టణాలలోను ఉన్న దూడ పూజను రద్దుపరచాడు, తన సంస్కరణల పనిని పర్యవేక్షించడానికి తానే స్వయంగా రాజ్యంలో సంచరించాడు.

బి. మెగిద్దో యుద్ధము. – దివ్యమైయున్న యోషీయా పరిపాలన ఆపత్కరంగా ముగిసింది. తిరిగి గొప్ప రాజ్యములైన అష్షూరు ఐగుప్తులు యుద్ధంలో దిగాయి. కర్కెమీషును పట్టుకొనడానికి ఫరోనెకో ప్రయాణంలో ఉన్నాడు, యూఫ్రటీసు పైభాగంలో, యోషీయా అవివేకంగా జోక్యం కలిగించుకున్నాడు, మరియు మెగిద్దో వద్ద జరిగిన యుద్ధంలో అతడు తన ప్రాణాన్ని కోల్పోయాడు. యోషీయా మరణము యూదా వినాశనంగా రుజువైయుంది. "దావీదు త్రోవలలో నడిచిన" చివరి రాజు అతడే (2 రాజులు 22:2). జాతీయ నిబంధనకు నమ్మకముగా ఉన్నవాడు కూడా అతడే. ఆ మంచి రాజుపైన వ్యక్తపరచబడిన ప్రలాప గీతములో యిర్మీయా విలాపము బహు గొప్పదైయుంది.

## IV. చివరి క్షీణత, చెరగొని పోబడడం.

**1. నీతి నశించుట.** – యోషీయా సంస్కరణలు దేశవ్యాప్తంగా జనుల హృదయాలలో ఒప్పింపబడిన రీతిని నాటబడలేదు. అయితే అవి రాజ్యపు అధికారాన్ని బట్టి అమలు చేయబడ్డాయి, అధికారం ఎప్పుడు వెనుకకు తీసికొనబడిందో అప్పుడు అవి పడిపోయాయి. అక్కడ చిన్నగా ఏర్పరచబడిన పరిధి ఉంది, దానికి యిర్మీయా గుండెవంటివాడైయున్నాడు.

యౌవనుడైన దానియేలును అతని స్నేహితులును దానికి చెందినవారైయున్నారు. వారే నిజమైన ఇశ్రాయేలు అయ్యున్నారు; భావి జాతీయ జీవితానికి వారు అంకురమైయున్నారు; అయితే దేశం మొత్తము చేరి నిరీక్షణ లేనంతగా చెడిపోయి యున్నారు. వంద సంవత్సరాలకు ముందుగానే యెషయా వీరి విషయమై యిలాగు వ్రాశాడు, "పాపిష్ఠి జనమా, దోష భరితమైన ప్రజలారా, దుష్టసంతానమా, చెరుపుచేయు పిల్లలారా, మీకు శ్రమ. వారు యెహోవాను విసర్జించియున్నారు ... ప్రతివాడు నడినెత్తిని వ్యాధి గలిగియున్నాడు, ప్రతివాని గుండె బలహీనమాయెను. అరకాలు మొదలుకొని తలవరకు స్వస్థత కొంచెమైనను లేదు. ఎక్కడ చూచినను గాయములు దెబ్బలు ..." (యెషయా 1:4–6). యిర్మీయా యొక్క రచనలైతే ఈ కాలం ముగిసేవరకు గాఢాంధకారం కమ్ముకొని వచ్చినట్లుంటాయి. విగ్రహారాధన, త్రాగుబోతుతనం, దురాశ, కామవికారము, మృగ సంబంధమైన ఆగ్రహము వంటి దుర్గుణాలతో నిండి రాజకీయ పతనానికి ముందుగా నైతిక చెడుగు నడిచింది.

**2. ఒకదాని వెంట మరొకటి వచ్చిన బానిసతనం.** – యోషీయా వెంట నలుగురు రాజులు వచ్చారు: యెహోయహాజు, యెహోయాకీము, యెహోయాకీను, సిద్కియా. వీరిలో మూడవవాడు యోషీయాకు మనుమడు; తక్కినవారు కుమారులు. అటు బబులోనుకు గాని, యిటు ఐగుప్తుకుగాని వారందరు కీలుబొమ్మలే. ఈ కాలపు ఆరంభ భాగంలో, అష్షూరుకు రాజధాని నగరుగా ఉన్న నీనెవె అనేక శతాబ్దాలు పశ్చిమ ఆసియామీద ప్రభుత్వం చేసింది, గాని మాదీయ, బబులోనులు కలిసి చేసిన దాడులలో క్రుంగిపోయింది. అది మొదలుకొని, బబులోను ఐగుప్తులు మీది క్రింది[3] తిరుగటి రాళ్లవలె ఉండి, యూదాను దుమ్ముగా విసిరాయి. ఫరోనికో యెహోయహాజును పట్టుకొనిపోతూ, అతని సహోదరుడైన యెహోయాకీమును సింహాసనముపై నిలుపుతాడు. ఆసియాలో ఐగుప్తు తనతో పోటీ పడడాన్ని బబులోను సహించలేదు. బబులోను బలిష్టుడైన రాజగు నెబుకద్నెజరు ఒకదానివెంట ఒకటిగా దండయాత్రలను సాగించి, జనులను చెరగొని పోతూ, ఆ నాటకాన్ని ముగిస్తాడు.

**ఎ. మొదటిసారి చెరగొని పోవడం.** – అతడు యెరూషలేమును (క్రీ.పూ. 606లో) పట్టుకొని యెహోయాకీమును ఉండనిచ్చి, దేశ జనులలో కొందరిని చెరగొని పోవడంతో సంతుష్టి చెందాడు. అందులో దానియేలు, షద్రకు, మేషకు, అబెద్నెగోలున్నారు. వారు రాజ వంశీయులైయున్న యువరాజులును, జాతీయ మతముపట్ల నమ్మకమైనవారై యున్నందున, వారు లేకుండ పోవడం రాజుకు సంతోషం కలిగించి ఉండవచ్చు అనడం నిస్సందేహం. పదకొండు సంవత్సరాల ఏలుబడి తరువాత తానే భయంకరమైన చావు చచ్చాడు.

**బి. రెండవసారి చెరగొని పోబడడం.** – క్రీ.పూ. 597లో నెబుకద్నెజరు రెండవ దండయాత్ర చేస్తాడు. అతడు రాజైన యెహోయాకీనును చెరగొని పోయి, ముప్పైయయిదు సంవత్సరాలు బందీగా ఉంచుతాడు. ప్రవక్తయైన యెహెజ్కేలును, తనతోపాటు పదివేల మంది పై తరగతికి సంబంధించిన వారును ఈ రెండవసారి చెరలోనికి తీసికొని పోబడతారు. అప్పుడు సిద్కియా సింహాసనంమీద కూర్చోబెట్టబడతాడు. పదకొండు

సంవత్సరాలపాటు యూఫ్రటీసు గొప్ప రాజుకు చెందిన సామంతుగా అతడు పాలిస్తాడు.

**సి. మూడవసారి చెరగొని పోబడడం.** – ఈ కాలమంతటిలో యెరూషలేము వద్ద ఐగుప్తీయుల పార్టీ బబులోను కాడిక్రింద రుద్దబడియుండి, ఐగుప్తుతో సంబంధం కుదుర్చు కొనేలా ప్రేరేపించింది. దేశం డెబ్భై సంవత్సరాలు బబులోను బానిసత్వం క్రింద ఉండ బోతుందని, అది దేవుని తీర్పు అయ్యున్నట్టు యిర్మీయా ప్రకటించాడు, గనుక ఆ అధికారానికి లోబడి యుండవలెనని అతడు సలహాయిచ్చాడు. అందుకొరకు అతడు భయంకరమైన చీకటి బిలములో ఖైదీగా చేయబడ్డాడు. చివరికి క్రొత్త తిరుగుబాటు నెబుకద్నెజరు యొక్క సైన్యాలను యూదాకు రప్పించింది. క్రీ.పూ. 586లో, శ్రమ కలిగించే ముట్టడితో, అతడు యెరూషలేమును పట్టుకున్నాడు. సిద్కియా యొక్క పిల్లలను తన కండ్లముందు చంపివేశాడు, అతని కండ్లు తీయించాడు, సంకెళ్లతో అతని బబులోనుకు కొనిపోయాడు. పట్టణపు ప్రాకారాలు కూల్చివేయబడ్డాయి, దేవాలయము, రాజ భవనాలు అగ్నితో కాల్చివేయబడ్డాయి, శ్రేష్ఠమైన మనుష్యులు చెరగొనిపోబడ్డారు. దావీదు పట్టణమైన యెరూషలేము, కొద్దిమంది నమ్మకమైన జనుల హృదయాలలో తప్ప ప్రశస్తమైన జ్ఞాపకాలు గల పట్టణము యిక లేకుండా పోయింది. నమ్మకస్థులైన ఆ జనులు డెబ్భై సంవత్సరాలు చెరలో ఉన్న కాలమంతటిలో ఆ పరిశుద్ధ పట్టణం కొరకు వాంఛిస్తూ, తిరిగి వస్తారనే వాగ్దానం కొరకు ఆశతో ఎదురు చూస్తూ ఉండేవారు.

సూచనలు

[1]హెబ్రీయుల చరిత్రను పూర్తిగా చదవగోరితే, వివరాలకొరకు ప్రవక్తలయొక్క రచనలను పఠించాలి దేశముయొక్క నైతిక, సాంఘీక, రాజకీయ పరిస్థితులమీద అవి వెలుగును విరజిమ్ముతాయి. దావీదు యొక్కయు, అతని లైన్ (సంతతి) యొక్కయు చరిత్రగల దినవృత్తాంతాలను చెరానంతరం ఎజ్రా వ్రాసియుండవచ్చునేది గమనార్హం. సౌలు చరిత్ర ఉత్తర దేశము చరిత్ర సంపూర్ణంగా వదిలివేయబడింది. [2]See Alfred Edersheim, “History of Israel and Judah,” Vol. V., pp. 129, 130. [3]Dean had “nether.”

| ఇశ్రాయేలు రాజులు | యూదా రాజులు |
|---|---|
| 1. యరొబాము | 1. రెహబాము |
| 2. నాదాబు | 2. అబీయా లేక అబీయాము |
| 3. బయెషా | 3. ఆసా |
| 4. ఏలా | 4. యెహోషాపాతు |
| 5. జిమ్రీ | 5. యెహోరాము |
| 6. ఒమ్రీ | 6. అహజ్యా |
| 7. అహాబు | 7. అతల్యా |
| 8. అహజ్యా | 8. యోవాషు |
| 9. యోరాము లేక యెహోరాము | 9. అమజ్యా |
| 10. యెహూ | 10. ఉజ్జియా లేక అజర్యా |
| 11. యెహోయహాజు | 11. యోతాము |
| 12. యోవాషు లేక యెహోయాషు | 12. ఆహాజు |
| 13. యరొబాము II | 13. హిజ్కియా |
| 14. జెకర్యా | 14. మనష్షే |
| 15. షల్లూము | 15. ఆమోసు |
| 16. మెనహేము | 16. యోషీయా |
| 17. పెకహ్యా | 17. యెహోయహాజు |
| 18. పెకహు | 18. యెహోయాకీము |
| 19. హోషేయ | 19. యెహోయాకీను లేక యెకొన్యా, కొన్యా |
| | 20. సిద్కియా |